వెదజల్లే పద్ధతి మేలు

- కూలీల సమస్యతో పాటు డబ్బులు ఆదా
- ఉమ్మడి మండలంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు
- యాజమాన్య పద్ధతులు పాటించాలి



రేవల్లి మండలంలో వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

గోపాల్‌పేట: వరి సాగులో మూస పద్ధతులు విడిచి పెట్టి వెదజల్లే పద్ధతి, డ్రంసీడర్ ద్వారా విత్తనాలు వేయడం ద్వారా అధిక లాభాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దీంతో పంటకు పెట్టుబడి తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చు. సాధారణంగా నాట్లు వేసే దానితో పోల్చుకుంటే ఎకరాలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఆదా అవుతుంది. దీనికి తోడు కూలీల కొరతను అధిగమించవచ్చు.

250 ఎకరాల్లో..

గతేడాది ఉమ్మడి మండలంలో రైతులు సుమారు 250 ఎకరాలకు పైగా వెదజల్లే పద్ధతి ద్వారా వరి పంట సాగుచేసుకున్నారని వ్యవసాయ అధికారులు తెలిపారు. అప్పటి ఫలితాలు చూసిన మిగితా రైతులు ఈ వానాకాలంలో వెదజల్లే పద్ధతికి మొగ్గు చూపుతారని అంచనా వేస్తున్నారు.

విత్తన గొర్రు పద్ధతి

విత్తన గొర్రు పద్ధతిలో శుద్ధి చేసిన విత్తనాన్ని చదును చేసిన పొలంలో నాగటి సాలు వెనక లేదా గొర్రు, ట్రాక్టర్‌తో వేయడం ద్వారా సమయం ఆదా అవుతోంది. ఎరువులు, విత్తనాన్ని ఒకేసారి చేసే ఫర్టికంసీడ్ డ్రిల్ సాళ్లలో విత్తనాలను మట్టి కప్పే విధంగా చూసుకోవాలి. ఎరువుల పరంగా చూస్తే నత్రజని 25 శాతం ఎక్కువగా వేసుకోవాలి. కానీ ఈ పద్ధతిలో ఇనుపధాతు లోపం వచ్చే అవకాశం ఉంటుంది. ఆకులు తెల్లగా పాలిపోయి పంట ఎదుగుదల కుంటుపడినట్లు అయితే లీటరు నీటికి ఐదు గ్రాముల అన్నబేది, ఒకగ్రాము నిమ్మప్పు కలిపి అవసరాన్ని బట్టి రెండు లేదా మూడుసార్లు పిచికారీ చేసుకోవాలి. కలుపు యాజమాన్యంలో విత్తిన 45 రోజుల వరకు కలుపు రాకుండా జాగ్రత్త పడాలి. కలుపు నివారణకు బిస్‌పైరిబ్యాంక్ సోడియం వంద నుంచి 120 మిల్లీలీటరు కలిపి ఎకరాకు పిచికారీ చేయాలి.

ఎకరాకు 15 కిలోలు

వెదజల్లే పద్ధతిలో కరిగెట చేసిన తర్వాత ఎకరానికి 15 కిలోల ధాన్యం 24 గంటలు నానబెడితే మొలక చిన్నగా వస్తుంది. వాటిని కరిగెటలో వెదజల్లాలి. ఈ పద్ధతిలో ఎక్కువ ఎత్తు పెరగని రకం విత్తనాలను ఎంచుకోవాలి.

కూలీల ఇబ్బందులు ఉండవు



నాకు పదెకరాల భూమి ఉంది. పెట్టుబడి ఖర్చులు ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉన్నాయి. వ్యవసాయ అధికారులు వెదజల్లే పద్ధతి ద్వారా ఖర్చు తగ్గడంతో పాటు కూలీల ఇబ్బందులు ఉండవని వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సారి ప్రయత్నిస్తాను. – శేఖరెడ్డి, చెన్నూరు

రైతులకు మేలు

రైతులు వెదజల్లే పద్ధతి ద్వారా పంటసాగు చేస్తే పని తగ్గుతుంది. దాంతోపాటు ఖర్చు తగ్గడం, దిగుబడి పెరగడం, కూలీల ఇబ్బంది తలెత్తకుండా ఉంటుంది. అలాగే విత్తన గొర్రు పద్ధతి ద్వారా సాగు చేసినా మంచి ఫలితమే ఉంటుంది. గతేడాది 250 నుంచి 300 ఎకరాల వరకు సాగు చేశారు.
– కరుణశ్రీ, వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

ఐదు తరగతులు.. ఒక్కరే ఉపాధ్యాయురాలు



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 27 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కానీ ఉపాధ్యాయిని ఒక్కరే ఉండటంతో ఆమె అన్ని తరగతులను ఒకే దగ్గర కూర్చొబెట్టి విద్య బోధన చేస్తుంది. పాఠశాలకు రెండు గదులు ఉంటే అందులో ఒక గది గోడలు నెర్రెలు బారి వర్షాకాలంలో నీరు లోపలికి వస్తోంది. పాఠశాల గదులు మరమ్మతు చేయడంతో పాటు ప్రహరీ నిర్మాణం, అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి కోరారు.

రెవెన్యూ సదస్సులో 429 దరఖాస్తులు



పాన్‌గల్: మండలంలో ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించిన రెవెన్యూ సదస్సులు గురువారంతో ముగిశాయి. రెవెన్యూ సదస్సుల్లో 28 గ్రామ పంచాయతీల పరిధిలో 429 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. చివరి రోజు పాన్‌గల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 6 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌కుమార్, ఆర్ఐలు తిరుపతయ్య, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలి



వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం జీహెచ్ఆర్‌టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంటి నిరంజనయ్య, కార్యదర్శి డాక్టర్ బండారు శ్రీనివాసులు సందర్శించారు. వారికి విద్యార్థులు పూలబొకె అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చెలిమి సంస్థ అధ్యక్షుడు రవి వారిని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి రీత్యా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరి రాజాచారి, షఫీ, సంజీవయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. గురువారం మండలంలోని మామిడిమాడ, తదితర గ్రామాల పాఠశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. మామిడిమాడ ప్రాథమిక పాఠశాలలో ఇప్పటివరకు 25 మంది విద్యార్థులు చేరినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

అమరుల ఆశయాల సాధనకు పనిచేద్దాం



వీపనగండ్ల: సీపీఎంలో పనిచేస్తూ నక్సలైట్ల దాడిలో మృతి చెందిన అమరుల ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి కిరణ్ అన్నారు. కామ్రేడ్ నర్సింహ స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ ప్రాంతంలో ఎస్ఎఫ్ఐ 18వ అఖిలభారత మహాసభలు జరగనున్నాయని తెలిపారు. అందుకు సంబంధించి నర్సింహ చెల్లెలు చిట్టెమ్మ చేతుల మీదుగా ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరింపచేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు జితేందర్‌గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు తారాసింగ్, జిల్లా కార్యదర్శి ఆది, నాయకులు నవీన్, శివ, చంటి, ప్రవీన్, సమీర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్యా.. సమస్యలు ఆలకించరూ..

- నేడు మండలంలో పర్యటించనున్న మంత్రి వాకిటి శ్రీహరి

అమరచింత: జిల్లాల పునర్విభజన సమయంలో కొత్తగా ఏర్పడిన అమరచింత మండలంలో నేటికీ ప్రధాన సమస్యలు పరిష్కారం కాకుండా మిగిలిపోయాయని, మీరైనా మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలంటూ మండల ప్రజలు మంత్రి వాకిటి శ్రీహరిని కోరుతున్నారు.

మంత్రిగా బాధ్యతలు తీసుకుని మొదటిసారి మండలానికి వస్తున్న మంత్రి శ్రీహరిని మండల సమస్యలను తెలియపరుస్తూ మంత్రివర్యా.. సమస్యలు ఆలకించవయ్యా అంటూ వేడుకుంటున్నారు. మండలం, మున్సిపాలిటీగా మారి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ పరంగా నూతన కార్యాలయాల నిర్మాణాలు పూర్తి కాలేదు.

❖ పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్ చదువుల కోసం ఆత్మకూర్ పట్టణంతో పాటు ఇతర మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలేజీ నిర్మాణం కోసం స్థలం పరిశీలించిన గత ఎమ్మెల్యే కాలేజీ విషయాన్ని మరుగున పడేశారు.

❖ భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా కాల్వ నుంచి సాగునీరు అమరచింత వరకు వస్తుందని, చంద్రనాయక్ తండా సమీపంలో రిజర్వాయర్ నిర్మించి ఇక్కడి రైతులను ఆదుకోవాలన్న డిమాండ్ ఏళ్ల తరబడి తీరట్లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

❖ రిహబిటేషన్ గ్రామాలైన ఈర్లదిన్నె, కిష్టంపల్లి, నందిమళ్ల ఎక్స్‌రోడ్, చింతరెడ్డిపల్లి గ్రామాల్లోని ఆలయాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటి కోసం దేవాదాయ శాఖ ద్వారా నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

❖ నిధులు మంజూరయినా నేటికీ మస్తీపురంలో సీసీ రహదారి పనులు మొదలు కాలేదని వాపోయారు.

❖ మున్సిపాలిటీలో టౌన్ హాల్, గ్రంథాలయం లేక నిరుద్యోగులు, విద్యావంతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

❖ మున్సిపాలిటీలోని మరికల్–ఆత్మకూర్ ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ లేకపోవడంతో వర్షపునీరు దుకాణాలతో పాటు ఇళ్లలోకి చేరుకుంటుందని వాపోతున్నారు.

ప్రపంచ శాంతికి ముందడుగు వేయాలి



పాన్‌గల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ అన్నారు. భారతదేశం ఇజ్రాయిల్‌కు మద్దతునివ్వడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను మానవతావాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటయ్య, రాము, భీమయ్య, జంబులయ్య, కృష్ణయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: ఇజ్రాయెల్ దాడులతో అతలాకుతలం అవుతున్న పాలస్తీనాకు సీపీఎం సంఘీభావం తెలియజేస్తూ, గురువారం సీపీఎం అఖిల భారత కమిటీ పిలుపు మేరకు రాజీవ్‌చౌక్‌లో ఇజ్రాయెల్ యుద్ధోన్మాదం నశించాలని నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ పాలస్తీనాలో చిన్నారులు, మహిళలపై ఇజ్రాయెల్ చేస్తున్న అమానవీయ చర్యలను ఖండించారు. కార్యక్రమంలో పరమేశ్వరాచారి, మేకల ఆంజనేయులు, గంధం మదన్, జి బాలస్వామి, గట్టయ్య, కురుమయ్య, రాములు, లక్ష్మి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



రాయిణిపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: మండలంలోని రాయిణిపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్లు మంజూరు చేసేందుకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. మొదటి విడతలో అర్హులైన 32 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు.

లబ్ధిదారులతో సమావేశం

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ రాఘవ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చి, ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. పెబ్బేరు మండలంలో తిప్పాయిపల్లిలో ఎంపీడీఓ రవీంద్ర ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించి, ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనల మేరకు గృహ నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మల్లికార్జున్, టీఏ పాషా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తిప్పాయిపల్లిలో..

యోగా పోటీలు విజయవంతం చేయండి

పాన్‌గల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 21న మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న యోగా పోటీలను విజయవంతం చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాల స్థాయిలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు యోగా ప్రదర్శన చేసిన వీడియో రికార్డు చేసి మండల విద్యాశాఖ గ్రూప్‌లో పోస్టు చేయాలన్నారు. ఉత్తమ ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులకు 23వ తేదీన మండల కేంద్రంలో బహుమతులు అందజేస్తామని ఎంఈఓ పేర్కొన్నారు.

ప్రతి కాలనీని అభివృద్ధి చేస్తాం



వనపర్తిటౌన్: కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని కాలనీలు నేడు ఎమ్మెల్యే మేఘారెడ్డి హయాంలో అభివృద్ధి చెందుతున్నాయని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, సమన్వయకర్త లక్కాకుల సతీష్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని 4వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మునుపెన్నడు లేని విధంగా వనపర్తి వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. హంగు, ఆర్భాటాలు చేయడం కాదు అభివృద్ధి అంటే సమస్యలను పరిష్కరించి, మరలా ఆ సమస్యలు తలెత్తకుండా చేయడమే నిజమైన అభివృద్ధి అని చెప్పారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ.1.20 కోట్లు మంజూరు చేయడంతో 4వ వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా నడుస్తున్నాయని పరశురాం తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు బి.మన్నెంకొండ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

కొత్తకోట రూరల్: స్థానిక పోలీసులు తప్పిపోయిన బాలుడి ఆచూకీ కనుక్కొని తల్లికి అప్పగించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, కొత్తకోట సీఐ రాంబాబు తెలిపిన వివరాల మేరకు.. కొత్తకోట పట్టణ కేంద్రంలోని బుడుగజంగాల కాలనీకి చెందిన అంజమ్మకు ముగ్గురు కుమారులు. గురువారం ఉదయం మొదటి కుమారుడు స్కూల్‌కు వెళ్లగా రెండో కుమారుడు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్నాడు. మూడో కుమారుడైన నాలుగేళ్ల మనోజ్ ఇంటి దగ్గరే ఉంటున్నాడు. మధ్యాహ్నం 3గంటల సమయంలో చిన్నారి కనిపించకపోవడంతో తల్లి అంజమ్మ ఆందోళనకు గురై స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న కొత్తకోట ఎస్ఐ ఆనంద్ సీఐ రాంబాబు, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో వారు మూడు బృందాలను ఏర్పాటు చేసి పట్టణంలో గాలింపు చేపట్టారు. చివరకు రాత్రి ఏడు గంటల సమయంలో పట్టణంలోని ఓ వీధిలో బాలుడు కనిపించడంతో బాలుడిని తీసుకొచ్చి తల్లికి అప్పగించారు. తన కుమారుడిని అప్పగించిన పోలీసులకు అంజమ్మ కృతజ్ఞతలు తెలిపారు. బాలుడిని కనిపెట్టడంతో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని, ఎస్ఐ ఆనంద్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ రాంబాబు అభినందిచారు.

ఎస్సీ వర్గీకరణకు కలిసి రావాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వీపనగండ్ల: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత కల్పించే వరకు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సమష్టి పోరాటాలు నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో అంబేడ్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మొల్కలపల్లి నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్ తదితర అనుబంధ సంఘాలతో మండల కేంద్రంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పరశురాములు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మీసాల శ్రీను, బండారు విష్ణు, ప్రవీన్ మాదిగ, కురుమయ్య, కర్ణాకర్, మహేష్, రామ్‌చరన్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నర్సింగాపురంలో..

సాక్షి, నెట్‌వర్క్: రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం కాంగ్రెస్ నాయకులు జిల్లావ్యాప్తంగా సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో ఆయన చిత్రపటాలు ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి నాయకులు ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ భావిభారత ప్రధాని అని జోస్యం చెప్పారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా కేంద్ర ప్రభుత్వం అసమర్థ పాలనను సమర్థవంతంగా తిప్పికొడుతున్నారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పేదలు, రైతులకు సంక్షేమ ఫలాలు దక్కుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్దన్, కాంగ్రెస్ వనపర్తి పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్లు పాకనాటి కృష్ణ, బి.కృష్ణ, సమన్వయకర్త లక్కాకుల సతీష్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, మైనార్టీ జిల్లా నాయకుడు ఎండీ రహీం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆదిత్య, ద్యారపోగు వెంకటేష్, గంధం కృష్ణబాబు, శ్రీకాంత్, రవిసాగర్, ఖమ్మర్ మియా, సమద్‌మియా, రాగి వేణు, ఎండీ బాబా, మిద్దె స్వామి, తలారి రాజు, పెద్ద లక్ష్మయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి



ఎక్స్‌రేను పరిశీలిస్తున్న వైద్య బృందం

పాన్‌గల్: మండలంలోని వివిధ సబ్‌సెంటర్ల పరిధిలో కొనసాగుతున్న సమగ్ర ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేయించుకోవాలని సీహెచ్ఓ రామయ్య అన్నారు. గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లి సబ్‌సెంటర్ పరిధిలో జిల్లా వైద్య బృందం, ఎన్‌జీఓ టీమ్ సభ్యుల సహకారంతో డయాబెటిస్, బీపీ, హిమోగ్లోబిన్, క్షయవ్యాధి నిర్ధారణకు స్పూటమ్ సేకరణ, ర్యాండమ్ బ్లడ్ పరీక్షలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, హెపటైటిస్ బీ మొదలగు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ వైద్యులు తారాశాంక్, మొబైల్ హెచ్ఐవీ కౌన్సిలర్ బంగారయ్య, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మణ్, క్షయ వ్యాధి బృందం కోఆర్డినేటర్ వినోద్, రేడియోగ్రాఫర్ లక్ష్మీనారాయణ, ఎక్స్‌రే టెక్నీషియన్ ఖాజా, వైద్య సిబ్బంది సుమనశ్రీ, సంతోషిదేవి, సరళ, సతీష్, రాంచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి నీలిమ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడు ప్రాజెక్టును నింపి, రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న కృష్ణయ్యయాదవ్

మదనాపురం: జిల్లాకు తాగు, సాగు నీరు అందించే రామన్‌పాడు జలాశయాన్ని సత్వరమే నింపాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్ కోరారు. ఎన్నడూ లేని విధంగా జూరాలకు మే నెలలోనే వరద పోటెత్తినా.. సద్వినియోగం చేసుకోవడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూరాల నుంచి దిగువన ఉన్న శ్రీశైలానికి నీరు వెళ్తుంటే స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోలేదన్నారు. జూరాల నీటితో రామన్‌పాడు రిజర్వాయర్ నింపితే సరళసాగర్ ప్రాజెక్ట్, కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకం, నెల్విడి ఎత్తిపోతల పథకం లిఫ్టులు జలాశయాలకు జలకళ సంతరించుకుంటుదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిట్లి యాదగిరి, సింగిల్ విండో వైస్‌చైర్మన్ చీర్ల శ్రీనివాసులు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మాజీ సర్పంచులు విజయేందర్‌రెడ్డి, కోట్ల తిరుపతయ్య, పట్టణ అధ్యక్షుడు ఆవుల బాలు, మాజీ డైరెక్టర్ సత్యంయాదవ్, అచ్యుతారెడ్డి, సూరిబాబు, మద్దెల శ్రీనివాసులు, మండల యూత్ ప్రధాన కార్యదర్శి గడ్డమీది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాతో అప్రమత్తంగా ఉండాలి



అమరచింతలో అవగాహన కల్పిస్తున్న మేనేజర్ యూసూఫ్



ఆత్మకూర్‌లో..



జిల్లాకేంద్రంలో షాపు యజమానికి జరిమానా విధిస్తున్న హెల్త్ అసిస్టెంట్ శివకుమార్

వనపర్తిటౌన్: సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే సమయంలో డెంగీ, మలేరియా బారిన పడే అవకాశాలు ఎక్కుగా ఉంటాయని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో 100 రోజుల కార్యచరణలో భాగంగా వీధి, పెంపుడు కుక్కలు, తడి, పొడి చెత్త నిర్వహణ, ఏబీసీ ప్రచారం, డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 29వ వార్డులో ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఏర్పాటు, 6వ వార్డులో ఎస్ఎల్ఎఫ్ సమావేశం నిర్వహించారు. 1, 2, 3, 8, 9, 10, 11, 30, 31, 32వ వార్డుల్లో డ్రెయినేజీలను శుభ్రం చేసి, చెత్తచెదారాన్ని తొలగించినట్లు పేర్కొన్నారు. ప్రజలు చెత్త డ్రెయినేజీల్లో, వీధుల్లో వేస్తే దోమలు, ఈగలు కాలనీల్లో అధికంగా వ్యాపిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్తను మున్సిపల్ చెత్త సేకరణ వాహనాల్లోనే వేసి పట్టణ పరిశుభ్రతకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

షాపుల్లో తనిఖీలు

జిల్లా కేంద్రంలోని బట్టల, చెప్పుల షాపులు, హోటల్స్, కిరాణా షాపుల్లోని ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై గురువారం మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ తనిఖీలు చేశారు. 20 కేజీల ప్లాస్టిక్ కవర్లను పట్టుకున్నామని, కవర్లు వినియోగిస్తున్న షాపు యజమానులకు రూ.1,500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

అమరచింత: పరిసరాల అపరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని మున్సిపల్ మెనేజర్ ఇసూఫ్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 6వ వార్డులో గురువారం మురుగు కాల్వల శుభ్రత, పాత తొట్టెల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించుట, బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ తమ వంతుగా చేయాలన్నారు. మురుగు నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని కోరారు.

ఆత్మకూర్: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ శశిధర్ అన్నారు. గురువారం ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా స్థానికులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని సూచించారు.